సాక్షి
నిర్మల్
ఆదివారం । 21 । జనవరి । 2024



ముగిసిన ఐఎస్‌ఎల్‌ పోటీలు

ఆదిలాబాద్‌ జిల్లా ఉట్నూర్‌ మండల కేంద్రంలోని కొమురంభీం కాంప్లెక్స్‌ ప్రాంగణంలో నాలుగు రోజులు నిర్వహిస్తున్న రాష్ట్ర 7వ ఇంటర్‌ సొసైటీ స్పోర్ట్స్‌ లీగ్‌ క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. 8లో▸



అద్దె భవనాల్లో వసతి

భైంసా పట్టణంలోని పలు పోస్ట్‌మెట్రిక్‌ వసతిగృహాలు ఏళ్లుగా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నెలకు రూ.వేలల్లో అద్దెలు చెల్లిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0/18.9

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్‌

నిర్మల్‌ నుంచి అమలాపురానికి బస్సు

నిర్మల్‌టౌన్‌: నిర్మల్‌ నుంచి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని అమలాపురానికి సూపర్‌ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్‌ ప్రతిమారెడ్డి తెలిపారు. నిర్మల్‌ నుంచి అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమై మరుసటి రోజు సాయంత్రం 4:10 గంటలకు అమలాపురం చేరుకుంటుందని పేర్కొన్నారు. అమలాపురం నుంచి సాయంత్రం 5:40కి ప్రారంభమై, మరుసటి రోజు ఉదయం 9:45 గంటలకు నిర్మల్‌ చేరుకుంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉచిత గుండె వైద్య శిబిరం



చిన్నపిల్లలను పరీక్షిస్తున్న కిమ్స్‌ వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్‌: రాష్ట్రీయ బాలస్వస్థత కార్యక్రమంలో భాగంగా కిమ్స్‌ హాస్పిటల్‌ వైద్యులతో జిల్లా ప్రసూతి ఆస్పత్రిలోని మొదటి అంతస్తులో ఉచిత గుండె వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. కిమ్స్‌ వైద్యుడు డాక్టర్‌ సందీప్‌ ఈ వైద్య శిబిరానికి హాజరై 8 ఏళ్లలోపు 178 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. 54 మంది చిన్నారులకు శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. కిమ్స్‌ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్‌ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్‌ ధనరాజ్‌, జనరల్‌ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ సునీల్‌, నాయనారెడ్డి, శ్రీనివాస్‌, సరోజ, రజని, సురేశ్‌, సంధ్య పాల్గొన్నారు.

పంటల నాణ్యత పద్ధతులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సుందరేషన్‌

లోకేశ్వరం: పంటల నాణ్యత పద్ధతులపై రీజినల్‌ స్పైసెస్‌ బోర్డు విస్తరణ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్‌ సుందరేషన్‌ నటరాజన్‌ రైతులకు అవగాహన కల్పించారు. లోకేశ్వరం మండల కేంద్రంలో మహిళా అభివృద్ధి సంస్థ అమలుచేస్తున్న మహిళా ఉత్పత్తిదారుల ఆధ్వర్యంలో పసుపు, మిర్చి పండించే రైతులకు నాణ్యత మెరుగుదల ప్రమాణాలు, మార్కెటింగ్‌ అనుసంధాన అవకాశాలపై శనివారం శిక్షణ ఇచ్చారు. సుగంధ ద్రవ్యాల బోర్డులో పసుపుకు సంబంధించిన అవకాశాలు మార్కెటింగ్‌ సదుపాయాలు, పసుపు యాజమాన్య పద్ధతులు, నాణ్యత పెంచడానికి సాగులో అవలంభించాల్సిన పద్ధతులను వివరించారు. అనంతరం క్వాలిటీ గ్యాప్‌ పథకం కింద 90 శాతం సబ్సిడీతో పసుపు రైతులకు పసుపు ఉడకబెట్టే బాయిలర్‌, పాలిశ్‌ చేసే యంత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సుగంధ ద్రవ్యాల బోర్డు(స్పైసెస్‌ బోర్డ్‌) క్షేత్ర అధికారి రాజమాణిక్యం రైతులు పాల్గొన్నారు.

'డి1 పట్టాలు రద్దు చేస్తాం'

నిర్మల్‌చైన్‌గేట్‌: గత పాలకుల హయాంలో అధికారులతో కుమ్మక్కై వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని వాటన్నింటినీ రద్దు చేస్తామని, ఆ భూములను ప్రభుత్వానికి అప్పగిస్తామని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం మాట్లాడారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. 1965లో కట్టిన ఎస్సారెస్పీలో భూమి కోల్పోయిన వారికి డి1 పట్టాలు ఇస్తే 70 ఏళ్లుగా ఈ తతంగం కొనసాగిస్తున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా పదేళ్లలో వందల ఎకరాల్లో డి1 పట్టాలు సృష్టించారని తెలిపారు. అధికారులతో రివ్యూ నిర్వహించి ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారి వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపడతామని వివరించారు. సావళి గ్రామంలో 181 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు పట్టాలు చేసుకున్నారన్నారు. వీటిని రీసర్వే చేయిస్తామని తెలిపారు. వెంకటాపూర్‌లో 5 ఎకరాల గైరాన్‌ భూమిని డి1 పట్టాలుగా మార్చి ప్లాట్లు చేస్తున్నారన్నారు. గత పాలకులు ఇష్టానుసారంగా వ్యవహరించి మెడికల్‌ కళాశాలను గుట్టమీద కట్టారన్నారు. వర్షాకాలం ఆ ప్రాంతంలో నీరు నిల్వ ఉంటుందని. విద్యార్థులు బోట్‌లో వెళ్లాలా అని ప్రశ్నించారు. ప్రస్తుతం మెడికల్‌ కళాశాల ఏర్పాటు చేసిన ప్రాంతంలోని 534 సర్వే నంబర్‌ను అధికారులు సర్వే చేసి ఫెన్సింగ్‌ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో రావుల రామనాథ్‌, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అంతా రామమయం..

- జిల్లాలో మార్మోగుతున్న రామనామం
- ఏ ఇద్దరు కలిసినా 'జైశ్రీరాం'
- ప్రతీఇంటిపై కోదండరాముడి జెండా
- సెల్‌లో వాల్‌ పోస్టర్ల దగ్గర నుంచి..
- సోషల్‌ మీడియాలో పోస్టుల దాకా..
- అంతటా.. అయోధ్య రాముడే..
- నేడు, రేపు ప్రత్యేక కార్యక్రమాలు



రాముని జెండాతో చిన్నారి



నిర్మల్‌లో శ్రీరామ సప్తాహం నిర్వహిస్తున్న పండితులు

నిర్మల్‌: 'అంతా రామమయం.. ఈ జగమంతా రామమయం..'అన్నట్లుగా జిల్లా అంతా శ్రీరామ నామస్మరణ మార్మోగుతోంది. ఏ ఇద్దరు కలిసినా.. ఫోన్లో మాట్లాడినా.. హలో, నమస్తే, హాయ్‌బాయ్‌లు కాకుండా 'జైశ్రీరాం' అంటూ పలకరించుకుంటున్నారు. సెల్‌ఫోన్లలో వాల్‌పోస్టర్ల దగ్గర నుంచి వాట్సప్‌, ఫేస్‌బుక్‌ పోస్టులు, డీపీలు, స్టేటస్‌లు, రీల్స్‌, షార్ట్స్‌ దాకా.. అన్నింటా అయోధ్యరాముడే కనిపిస్తున్నాడు. ఉదయం ఆలయాల్లో రామనామ జపం, సాయంత్రం రామాయణ సప్తాహాలు కొనసాగుతున్నాయి. పలు పార్టీలు, సంస్థలు ప్రత్యేకంగా అయోధ్య రాముడి స్టిక్కర్లు ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. ఆది, సోమవారాల్లో మరిన్ని కార్యక్రమాలకు ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

స్మార్ట్‌ఫోన్లలో మార్మోగుతూ..

'రామ్‌ సియారామ్‌.. సియారామ్‌ జైజైరామ్‌..' అంటూ సెల్‌ఫోన్ల రింగ్‌టోన్‌గానూ రామనామమే మార్మోగుతోంది. ఎవరైనా ఫోన్‌ చేస్తే.. రింగ్‌కు బదులు వినిపించే కాలర్‌ట్యూన్‌గానూ రాముడి పాటలే పెట్టుకుంటున్నారు. తమ ఫోన్ల వాల్‌పేపర్‌తోపాటు వాట్సప్‌ డీపీలుగానూ రాముడే దర్శనమిస్తున్నాడు. వారం పదిరోజులుగా సోషల్‌మీడియాలో ప్రతీ పది పోస్టులలో 6–8 వరకు అయోధ్యకు సంబంధించినవే ఉంటున్నాయి. ఈరెండు రోజుల నుంచి మరింతగా రాముడు, రామాయణం, అయోధ్య, కరసేవ, బాల రాముడు, ఆలయ నిర్మాణం తదితర అంశాలకు సంబంధించినవే పోస్టు చేస్తున్నారు. కొంతమంది అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ప్రత్యేకంగా వాట్సప్‌ గ్రూప్‌లను ఏర్పాటు చేసి, అందులో రోజూ శ్రీరాముడికి సంబంధించిన విషయాలను పంచుకుంటున్నారు.

రామనామ జపాలు.. సప్తాహాలు..

బాల రాముడు కొలువుదీరే వేళను జీవితాంతం గుర్తుండిపోయేలా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని చాలా గ్రామాల్లోని ఆలయాల్లో ఇప్పటికే రామనామ జపాలు కొనసాగిస్తున్నారు. రామకోటి రాయిస్తున్నారు. సాయంత్రం రామాయణంపై సప్తాహాలు కొనసాగుతున్నాయి. జిల్లాకేంద్రంలోని బస్‌డిపో బోయవాడ హనుమాన్‌ మందిరం, ప్రియదర్శినినగర్‌ హనుమాన్‌ ఆలయంలో రామాయణంపై నిత్య ప్రవచనాలు కొనసాగుతున్నాయి. వివిధ గ్రామాల్లో నాటకాల రూపంలోనూ రామాయణాన్ని చిన్నారులకు చూపుతున్నారు.

ఇంటింటికీ..

అయోధ్యలో పూజించిన అక్షింతలు ఇప్పటికే ఇంటింటికీ చేరాయి. ఇక 'శ్రీరామరక్ష సర్వజగద్రక్ష' అన్న మంత్రంతో ఉన్న స్టిక్కర్లను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. వీటితోపాటు పలుచోట్ల రాముడి ఫొటోతో ఉన్న జెండాలను ఇళ్లపై ఎగరేయడానికి ఇస్తున్నారు. పలు సంఘాలు సోమవారం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుమేరకు ఇళ్లల్లో వెలిగించేందుకు ఐదు దీపాలనూ అందిస్తున్నారు. తమ ఇళ్లపై రాముడి జెండా ఎగరేసేందుకు చాలామంది పూజా స్టోర్లకు పరుగులు పెడుతున్నారు. ఈక్రమంలో రాముడి జెండాల కొరత ఏర్పడుతోంది.

జై శ్రీరాం.. జైజై శ్రీరాం..

అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ వేళ సర్వత్రా తన నామమే వినిపిస్తోంది. సాధారణంగా హలో, హాయ్‌ అని పలకరించుకునే వారు కూడా ఇప్పుడు 'జైశ్రీరాం' అని రెండుచేతులు జోడించి నమస్కరించుకుంటున్నారు. ఫోన్లలోనూ రామనామంతో పలకరింపు ప్రారంభం చేస్తున్నారు. ఇప్పటికీ గ్రామాల్లో పెద్దమనుషులు 'రాం రాం..' అనే పలకరించుకుంటుంటారు. ఇప్పుడు యువత అయోధ్య ప్రభావంతో 'జైశ్రీరాం' అని పలకరిస్తోంది.

నేడు, రేపు మరింతగా..

అయోధ్యలో సోమవారం ఉదయం బాల రాముడు కొలువుదీరనున్నాడు. ఈ అద్భుత ఘట్టాన్ని కళ్లారా వీక్షించేందుకు జిల్లావాసులూ ఎదురుచూస్తున్నారు. వివిధ పార్టీలు, సంఘాలు, కాలనీ సొసైటీలు ఒకే దగ్గర అందరూ కలిసి వీక్షించేందుకు పెద్ద స్క్రీన్‌లను ఏర్పాటు చేయిస్తున్నారు. స్థానిక రామాలయాల్లో పూజలు, కల్యాణోత్సవాలనూ చేపడుతున్నారు. జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్‌లో కల్యాణోత్సవం, అన్నదానంతోపాటు అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో గోమాత పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం కార్యక్రమానికి సంబంధించి ఆదివారమే ఏర్పాట్లు, కరపత్రాలు, స్టిక్కర్ల పంపిణీ చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

అల్ఫోర్స్‌లో ఆకట్టుకున్న 'శ్రీరామ్‌'



శ్రీరామ్‌.. అక్షరరూపంలో విద్యార్థులు

నిర్మల్‌: ధర్మానికి మారుపేరుగా నిలిచిన రాముడిలోని సుగుణాలను నేటితరానికి అందించాల్సిన అవసరం ఉందని, విద్యతోపాటు బుద్ధిని, సంస్కృతినీ తెలియజెప్పాలని అల్ఫోర్స్‌ విద్యాసంస్థల చైర్మన్‌ డాక్టర్‌ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. అయోధ్య ఆలయంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో జిల్లాకేంద్రంలోని పాఠశాలలో శనివారం విద్యార్థులతో 'శ్రీరామ్‌' అంటూ హిందీ అక్షరాల రూపంలో కూర్చుని ఆకట్టుకున్నారు. ఇందులో పాఠశాల ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్ష రాసి బయటకి వస్తున్న విద్యార్థులు

నిర్మల్‌ రూరల్‌: జవహర్‌ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,208 మంది విద్యార్థులకు 1,055 మంది హాజరయ్యారు. 153 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్ష నిర్వహించారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు.

అలనాటి అయోధ్య జ్ఞాపకం



నాడు జ్యోతి యాత్రలో పాల్గొన్న సంభు భోజారాం, గంగాధార్‌ పాటిల్‌(ఫైల్‌)



రథయాత్రకు రాముని చిత్రపటంతో బయల్దేరుతున్న స్థానికులు(ఫైల్‌)

- మూడు దశాబ్దాల క్రితం కరసేవకు జిల్లా కార్యకర్తలు
- లక్ష్యం నేరవేరడంతో సంతోషంలో భోజారాం పాటిల్‌

దిలావర్‌పూర్‌/నిర్మల్‌ ఖిల్లా: అయోధ్య రామమందిర నిర్మాణానికి మూడు దశాబ్దాల క్రితం నడుం బిగించి కరసేవకులుగా ఇక్కడి నుండి అయోధ్యకు తరలి వెళ్లిన వ్యక్తులు నాటి లక్ష్యం నేడు నెరవేరడంతో అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. 1989లో ఎల్‌కే.అధ్వానీ చేపట్టిన అయోధ్య రథయాత్రలో ఆయన వెంట నడిచిన దిలావర్‌పూర్‌ మండల కేంద్రానికి చెందిన కరసేవకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో రామ రథయాత్ర, జ్యోతియాత్ర, కరసేవకునిగా పనిచేసిన సంభు భోజారం పాటిల్‌ తన అంతరంగాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.


రాముని ప్రతిష్టాపనకు ఎదురుచూపు..

'కరసేవకు వెళ్లి రామ జన్మనభూమిని తాకుదామన్న మమ్మల్ని అడుగడుగునా అరెస్ట్‌ చేశారు. అప్పట్లో దిలావర్‌పూర్‌ నుంచి తనతోపాటు మరో కదం గంగాధర్‌పాటిల్‌, సట్టి పీరన్న, కట్కం రాజేందర్‌రెడ్డి, కదం పోతాజీపాటిల్‌, శివరాం పాటిల్‌, కమ్మరి రాజేశ్వర్‌ కరసేవకు వెళ్లొచ్చాం. తామంతా భవ్య రామమందిర నిర్మాణానం కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాం. ఈ క్రమంలో కాల క్రమంలో కదం పోతాజీ పాటిల్‌, శివరాం పాటిల్‌, రాజేశ్వర్‌ కాలం చేశారు. ఎట్టకేలకు రామ మందిరం నిర్మాణం పూర్తయి బాల రాముడు కొలువుదీరనుండడంతో మా నిరీక్షణ ఫలించింది.లక్ష్యం నెరవేరింది.'

కరసేవకు బృంద సభ్యుడిగా...

'నిర్మల్‌లోని బాగులవాడలో కరసేవకులకు అప్పట్లో శిక్షణ ఇచ్చారు. అందులో ఒక బృందానికి నేను కమాండర్‌గా పనిచేస్తూ కరసేవలో పాల్గొన్నాను. పలు ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. మరికొన్ని ప్రాంతాల్లో తమ కరసేవకులకు స్వాగతం పలికారు. రామజన్మభూమికి వెళ్లే క్రమంలో హాజీపూర్‌ జిల్లా కేంద్రంలో అరెస్ట్‌ చేశారు. 12 రోజులు జైల్లో ఉన్నాం. మాకన్నా ముందు అయోధ్యకు చేరుకున్న అనేక మందిని చంపి సరయు నదిలో పడేశారు. మేము కూడా ప్రాణాలతో తిరిగి వస్తామనుకోలేదు' అని సంభు భోజారాం పాటిల్‌ నాటి పరిస్థితులను తలుచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

జన్మ ధన్యమైంది..



మూడు దశాబ్దాలుగా భవ్యరాముని దివ్య మందిరం కోసం తపిస్తున్నాం. మా నిరీక్షణ కొన్ని గంటల్లో ఫలించబోతోంది. ఆ శ్రీరామచంద్రమూర్తి బాల రాముడిగా దర్శనమివ్వబోతున్నారు. చాలా సంతోషంగా ఉంది. మా జన్మ ధన్యమైంది.

–సంభు భోజారాం పాటిల్‌, దిలావర్‌పూర్‌



నాగోబా విగ్రహం

పూజాం'కితులు'



ఝురి(కలశం)కి పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు(ఫైల్‌)

- నాగోబా స్మరణలో మెస్రం వంశీయులు
- మహాపూజకు సన్నద్ధం
- నేటి నుంచే గంగాజల సేకరణ యాత్ర

ఇంద్రవెల్లి: నాగోబా జాతరకు సమయం ఆసన్నమైంది. ఆదివాసీల ఆరాధ్యదైవం ఆశీస్సుల కోసం మెస్రం వంశీయులు సిద్ధమవుతున్నారు. పుష్య మాస అమావాస్య పురస్కరించుకొని ఫిబ్రవరి 9న కేస్లాపూర్‌ ఆలయంలో మహాపూజకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇందులో భాగంగా ఈనెల 14న ప్రారంభించిన ప్రచారయాత్ర శనివారంతో కేస్లాపూర్‌ వద్ద ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని 22 కితల వారు ఆదివారం ఇక్కడికి చేరుకుంటారు. అనంతరం పవిత్ర గంగాజల సేకరణ యాత్రకు బయల్దేరుతారు.

మహాకార్యంలో భాగస్వాములవుతూ..

రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్‌ నాగోబా జాతరలో మెస్రం వంశీయుల పూజలు ప్రత్యేకంగా నిలుస్తాయి. ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్‌ పర్యవేక్షణలో 22 కితల వారు తమకు కేటాయించిన బాధ్యతలు నిర్వహిస్తారు. ఇందులో పటేల్‌, కటోడ, గాయికి, జాడియల్‌, నాయక్‌వాడి, సాంకేపాయిలాల్‌, ఎంపాలియల్‌, వాడే, సపాలి, ప్రధాన్‌, బేజిలికర్‌, హవాల్దార్‌, డివేకర్‌, ఎవితి, కోర్కార్‌, డప్‌, డాకలి, రంకం, బండే, బొడ్డిగూడియల్‌, గారుడి, కాంటేలకార్‌ కితలు ఉంటాయి. జాతర ప్రారంభం నుంచి మహాపూజ ముగింపు వరకు వీరంతా ఆలయ సమీపంలోని ప్రత్యేక గుడారాల్లో బస చేస్తూ మహాకార్యంలో భాగస్వాములవుతారు.

కితకో.. బాధ్యత

పటేల్‌..: మహాపూజతోపాటు కార్యక్రమాలన్నీ ఈయన ఆధ్వర్యంలోనే కొనసాగుతాయి. ప్రస్తుతం వెంకట్‌రావ్‌ ఆలయ పీఠాధిపతిగా కొనసాగుతున్నారు.

కటోడా..: ప్రతీ పూజను ఈ కితకు చెందిన వారే నిర్వహిస్తారు. ప్రధాన ఘట్టమైన మహాపూజతోపాటు ఉట్నూర్‌ మండలం బుడుందేవ్‌ పూజలు ముగిసే వరకు వీరిదే కీలక పాత్ర.

గాయికి, జాడియల్‌..: ఈ రెండు కితలకు చెందిన వారు గోదావరి నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంగాజలంతోపాటు ఝురి(కలశం)కు రక్షణగా ఉంటారు.

నాయక్‌వాడి..: మహాపూజ ప్రారంభం నుంచి ముగింపు వరకు కావాల్సిన నైవేద్యాల తయారీ బాధ్యత వీరిదే.

ప్రధాన్‌(పటడి): వీరు సంప్రదాయ పూజా కార్యక్రమాల్లో డోల్‌, పిప్రి, కిక్రి, కాలికోం వాయిద్యాలు వాయించడంతోపాటు నాగోబా, మెస్రం వంశీయుల చరిత్రను బోధిస్తారు.

జోపల్‌.: ఈ కితకు చెందిన వారు గోవడ్‌ మాలిక్‌గా వ్యవహరిస్తారు.

వాడే..: వీరు నైవేద్యం తయారీకి అవసరమైన పాత్రలను కట్టెతో తయారు చేసి అందిస్తారు.

ఎవితి.. : మహాపూజ మరుసటి రోజు నాగోబా ఆలయం వెనుక ఉన్న సతి దేవత పూజలను వీరు చేపడుతారు.

సపలి..: మహా పూజలో భాగంగా గౌరపూర్‌ గ్రామంలో ఉన్న పశువుల దొడ్డికి పూజలు చేసే బాధ్యతను వీరు నిర్వర్తిస్తారు.

మిగతా కితలకు చెందిన వారు సంప్రదాయ పూజా కార్యక్రమాల్లో వీరికి సహాయ, సహకారాలు అందిస్తారు.

ఆచారాన్ని పాటిస్తున్నాం



నాగోబా జాతరలో భాగంగా తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలను పాటిస్తున్నాం. మహాపూజ అంకురార్పన నుంచి ముగింపు వరకు 22 కితల వారు భాగస్వాములవుతారు. ఒక్కో కితకు ప్రత్యేక బాధ్యతలుంటాయి. అందరి సలహాలు, సూచనలతో సమన్వయంతో వ్యవహరిస్తూ సంప్రదాయ పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటాం. మహత్కార్యాన్ని విజయవంతం చేస్తాం.

– మెస్రం వెంకట్‌రావ్‌,
నాగోబా ఆలయ పీఠాధిపతి, పటేల్‌



సిరికొండ కుండలకు పూజలు చేస్తున్న కటోడా తదితరులు(ఫైల్‌)



నైవేద్యాలు తయారు చేస్తున్న మహిళలు(ఫైల్‌)

జిల్లా చరిత్ర గ్రంథస్థం అభినందనీయం

- హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి
- 'నిర్మల్‌ జిల్లా సమగ్ర స్వరూపం' గ్రంథాన్ని అందజేసిన రచయితలు



గ్రంథాన్ని అందజేస్తున్న జిల్లా రచయితలు

నిర్మల్‌ ఖిల్లా: నిర్మల్‌ జిల్లా సమగ్ర చరిత్రను గ్రంథ రూపంలో తేవడం అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి అన్నారు. జిల్లా కేంద్రంలో ''నిర్మల్‌ జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథం'' కోర్‌ కమిటీ కన్వీనర్‌ తుమ్మల దేవరావు ఆధ్వర్యంలో శనివారం గ్రంథాన్ని న్యాయమూర్తికి అందించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ భావితరాలకు జిల్లా చరిత్రను అందుబాటులోకి తేవడంతో జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు గత చరిత్రను వెలుగులోకి వస్తుందని అభిప్రాయపడ్డారు. జిల్లా విశిష్టత రాష్ట్రంలో ప్రత్యేకతను సంతరించుకునే విధంగా ఉంటుందని అన్నారు. లోతైన అంశాలను పరిశోధించి గ్రంథస్తం చేయడం సమష్టి కృషితోనే సాధ్యమన్నారు. అనంతరం తెలంగాణ రచయితల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు జువ్వాడి శ్రీదేవి– శ్రీహరిరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, వ్యాసకర్తలు కామారపు జగదీశ్వర్‌, పత్తి శివప్రసాద్‌, అబ్బడి రాజేశ్వర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్‌: జాతీయ ఆరోగ్య మిషన్‌ కింద ఒప్పంద ప్రాతిపదికన భైంసాలోని బస్తీ దవాఖానలో వైద్యాధికారిపోస్టు భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్‌ ధనరాజ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్‌ అర్హత కలిగి, తెలంగాణ మెడికల్‌ బోర్డు రిజిస్ట్రేషన్‌ కలిగిన వారు ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

ముగిసిన ఐఎస్‌ఎల్ పోటీలు


ఓవరాల్ చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న సోషల్ వెల్ఫేర్ సొసైటీ క్రీడాకారులు


ద్వితీయ స్థానంలో నిలిచిన స్టార్స్ క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న పీవో

- ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన సోషల్ వెల్ఫేర్ సొసైటీ
- ద్వితీయస్థానంలో నిలిచిన స్టార్స్ ట్రైబల్ వెల్ఫేర్ క్రీడాకారులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం కాంప్లెక్స్ ప్రాంగణంలో నాలుగు రోజులు నిర్వహిస్తున్న రాష్ట్ర 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ క్రీడా పోటీలు శనివారంతో ముగిసాయి. హోరాహోరీగా జరిగిన పోటీల్లో సోషల్ వెల్ఫేర్ సోసైటీ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఓవరాల్ చాంపియన్లుగా, స్టార్స్ ట్రైబల్ వెల్ఫేర్ క్రీడాకారులు ద్వితీయస్థానంలో నిలిచారు. విజేత జట్లకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ క్రీడల విజయవంతానికి కృషి చేసిన ఐటీడీఏ పీవో, అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో సైతం ఇలాంటి క్రీడలు నిర్వహిస్తే అక్కడి క్రీడాకారులకు కూడా క్రీడలపై ఆసక్తి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా కారులు ఒకేచోట చేరి క్రీడల్లో తమ సత్తా చాటడం అభినందనీయమన్నారు. క్రీడలతో శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింతగా క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీడీ దిలీప్‌కుమార్, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడలో

హాకీ అండర్–17 బాలికల విభాగంలో (ఏకలవ్య గురుకులం) ప్రథమస్థానం, టీటీడబ్ల్యూఆర్‌జేసీ ద్వితీయస్థానం, బాలుర విభాగంలో స్టార్ సొసైటీ ప్రథమస్థానం, బీసీ వెల్ఫేర్ ద్వితీయస్థానం, టీఎంఆర్ఎస్ తృతీయస్థానంలో నిలిచారు.

హ్యాండ్ బాల్ క్రీడలో..

హ్యాండ్ బాల్ అండర్–17 బాలుర విభాగంలో సోషల్ వెల్ఫేర్ సొసైటీ ప్రథమస్థానంలో, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ ద్వితీయస్థానంలో, బాలికల విభాగంలో స్టార్స్ సొసైటీ ప్రథమస్థానంలో, సోషల్ వెల్ఫేర్ ద్వితీయస్థానంలో నిలిచాయి.

ఫుట్ బాల్ క్రీడలో

ఫుట్ బాల్ అండర్–17 బాలుర విభాగంలో సోషల్ వెల్ఫేర్ ప్రథమస్థానంలో, ట్రైబల్ వెల్ఫేర్ ద్వితీయస్థానంలో బాలికల విభాగంలో సోషల్ వెల్ఫేర్ ప్రథమస్థానంలో, ట్రైబల్ వెల్ఫేర్ ద్వితీయస్థానంలో నిలిచాయి.

ఖోఖో క్రీడలో

ఖోఖో అండర్–17 బాలుర విభాగంలో ట్రైబల్ వెల్ఫేర్ ప్రథమస్థానంలో, స్టార్స్ సొసైటీ ద్వితీయస్థానంలో, బాలికల విభాగంలో మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం ప్రథమస్థానంలో, స్టార్స్ సొసైటీ ద్వితీయస్థానంలో నిలిచాయి. అండర్–14 బాలికల విభాగంలో స్టార్స్ సొసైటీ ప్రథమస్థానంలో, మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం ద్వితీయస్థానంలో నిలిచాయి. అండర్–14 బాలుర విభాగంలో స్టార్స్ సొసైటీ ప్రథమస్థానంలో, సోషల్ వెల్ఫేర్ ద్వితీయస్థానంలో నిలిచాయి.

క్లుప్తంగా

నాగోబా జాతర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో ఫిబ్రవరి 9 నుంచి 15 వరకు నిర్వహించనున్న నాగోబా జాతర పోస్టర్‌ను శనివారం మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, ఎంపీపీ జైవంత్‌రావు, డీడీ దిలీప్‌కుమార్, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

సారంగపూర్: మండలంలో శనివారం పిచ్చికుక్కలు ముగ్గురిపై దాడి చేసి గాయపరిచాయి. అడెల్లిలో ఓ మహిళపై, సారంగపూర్‌లో భూమన్న, గంగన్న అనే ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి గాయపరిచాయి. గమనించిన స్థానికులు వాటిని వెంబడించి కొట్టి చంపేశారు. ఇలాంటి ఘటనలు తరచూ మండలంలోని పలు గ్రామాల్లో పునరావృతం కావడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుక్కలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చోర్గవ్‌లో సమావేశమైన మెస్రం వంశీయులు


సమావేశంలో పాల్గొన్న మెస్రం వంశీయులు

నార్నూర్: మండలంలోని చోర్గవ్ గోండుగూడలో శనివారం మెస్రం వంశీయులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. మెస్రం వంశీయుల అభివృద్ధితో పాటు కేస్లాపూర్ నాగోబా ఆలయ అభివృద్ధికోసం మెస్రం వంశానికి చెందిన ఒక్కో కుటుంబం నుంచి రూ.2 వేల చొప్పున నిధులు సేకరించారు. ఈ సందర్భంగా కటోడా మెస్రం హనుమంత రావు మాట్లాడుతూ మెస్రం వంశీయుల విద్య, వైద్యం అభివృద్ధితో పాటు అత్యవసర సమయంలో అవసరం కోసం ఏటా నిధి సేకరిస్తామని అన్నారు. సేకరించిన నిధులను నాగోబా ఆలయ కమిటీకి అందజేస్తామన్నారు. సమావేశంలో మెస్రం వంశ పెద్దలు మాణిక్ రావు, చందర్ షావ్, మెస్రం రూప్‌దేవ్ పటేల్, చిత్రు, తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌కు కవితార్చన పురస్కారం

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు క్యాస సంతోష్ అయోధ్య రాముని అనంత కవితార్చన పురస్కారం అందుకున్నారు. అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌కు చెందిన మహతి సాహితీ కవిసంగమం ఆధ్వర్యంలో అంతర్జాల వేదికగా నిర్వహించిన కవితార్చనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహితీ సంగమ అధ్యక్షుడు సదయ్య ప్రశంసపత్రం అందజేశారు.

బీజేపీ పాలనలోనే అన్నింటా అభివృద్ధి

- ఎంపీ సోయం బాపూరావు


డ్రోన్ స్ప్రేయర్‌ను పరిశీలిస్తున్న ఎంపీ

గుడిహత్నూర్: బీజేపీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్న నిజాన్ని అందరూ తెలుసుకోవాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మండలంలోని గర్కంపేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. దేశ రక్షణతో పాటు దేశంలో ఉన్న అనేక సమస్యలను పరిష్కరిస్తూ నిరుపేదలు, సామాన్యులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పీఎం విశ్వకర్మ యోజనతో పాటు, ముద్ర యోజన, సుకన్య సమృద్ధి, ఎంఎస్ఎంఈ లాంటి పథకాలు ప్రవేశపెట్టి నేడు ప్రపంచంలో ఆర్థిక అభివృద్ధి సాధించిన దేశాల్లో మూడో స్థానానికి చేర్చారన్నారు. సులభమైన వ్యవసాయం చేయడానికి స్వయం సహాయక సంఘాలకు డ్రోన్ అందించడం జరుగుతుందన్నారు. కేవీకే అధికారులు డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసే విధానాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పతంగె బ్రహ్మానంద్, కేవీకే అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడి నరకయాతన

- బైక్ అదుపుతప్పి కిందపడడంతో గాయాలు
- కడెం ఆస్పత్రికి తరలింపు
- అందని ప్రథమ చికిత్స
- నిర్మల్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో ఆగిన అంబులెన్స్

కడెం: తీవ్ర గాయాలతో ఆస్పత్రికి వెళ్తే ప్రథమ చికిత్స అందకపోగా..మరో ఆస్పత్రికి వెళ్లేందుకు 108 ఎక్కితే అది కాస్తా చెడిపోవడంతో మార్గమధ్యలో వదిలిపెట్టడంతో ఓ క్షతగాత్రుడు పడిన నరకయాతన సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. వివరాల్లోకి వెళితే లక్ష్మణచాందకు చెందిన భీమేశ్ కొండగట్టుకు వెళ్లి ఈ నెల 19న రాత్రి బైక్‌పై స్వగ్రామానికి తిరిగివస్తుండగా బెల్లాల్ ఎక్స్‌రోడ్డు వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో విషయం తెలుసుకున్న పెద్దూర్‌కు చెందిన అతని బావ శ్రీనివాస్ కడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో పెద్ద సైజు బ్యాండేజీలు(పట్టీలు) ఇక్కడ లేవని సిబ్బంది తెలిపారు. చేసేదేం లేక 108కు కాల్ చేశారు. అంబులెన్స్‌లో ఎక్కి నిర్మల్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో మస్తాన్ ఎల్లాపూర్ వద్ద వాహనం ఆగిపోయింది. బంధువులు కారులో నిర్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మరో అరగంట ఆలస్యమైతే ప్రాణాలు దక్కేవి కాదని డాక్టర్లు తెలిపారు. కనీసం ప్రథమ చికిత్స అందించని ఆస్పత్రి ఎందుకని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కల్లూర్‌లో చిరుతపులి పిల్లల సంచారం..!


పంట పొలాల్లో గాలింపు చేపట్టిన అధికారులు


అధికారులు గుర్తించిన చిరుత పులి పిల్ల పాదముద్ర


కుంటాల: నిర్మల్ జిల్లా కుంటాల మండలం కల్లూర్–తిమ్మాపూర్ గ్రామాల మధ్య శనివారం చిరుత పులి పిల్లల సంచారం కలకలం రేపింది. స్థానిక రైతుల సమాచారం ప్రకారం.. కల్లూర్‌కు చెందిన రైతు మహేశ్వర్‌రావు శనివారం మధ్యాహ్నం మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఈ సమయంలో అక్కడ నాలుగు చిరుత పులి పిల్లలు కనిపించాయి. ఒకటి చెట్టుపై, మరో మూడు కింద ఉన్నాయని తెలిపాడు. చెట్టు పైనుంచి దిగిన చిరుత పులి పిల్లతోపాటు మరోమూడు తన వైపుగా రావడంతో భయంతో ఊళ్లోకి పరిగెత్తుకుంటూ వచ్చానని వెల్లడించాడు. తన అల్లుడు రమాకాంత్‌రావుకు విషయం చెప్పగా ఆయన ఎఫ్‌బీవో హరిలతకు సమాచారం అందించాడని పేర్కొన్నాడు. సిబ్బందితో గ్రామానికి చేరుకున్న ఎఫ్‌బీవో చిరుత పులి పిల్లలు సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు. పాదముద్రలు సేకరించి గాలింపు చేపట్టారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 10న పెంచికల్‌పాడ్ శివారులో నారాయణరెడ్డి పాలేర్లు సందీప్, విజయ్‌కు చిరుత పులి, శుక్రవారం కల్లూర్‌కు చెందిన రైతు సామ భోజారెడ్డికి నాలుగు చిరుతపులి పిల్లలు కనిపించాయని పేర్కొన్నారు. దీంతో రైతులు పొలాల వద్దకు వెళ్లడానికి కూడా భయపడుతున్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శన


విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి తయారు చేసిన పరికరం రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు తాంసి పాఠశాల హెచ్ఎం శ్రీకాంత్ తెలిపారు. జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక మేళాలో భాగంగా శుక్రవారం జిలాస్థాయిలో వర్చువల్ మీటింగ్ ద్వారా ప్రదర్శనలు నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి వివిధ రకాల ప్రదర్శనలు నిర్వహించారు. తాంసి పాఠశాలకు చెందిన విద్యార్థి జి.కార్తీక్ నాన్ స్టిచింగ్ యూరియా డిస్పోస్ యూనిట్ అనే పరికరం తయారుచేశారు. రైతులకు ఎరువులు వేయడానికి సులువుగా ఉండటంతో పాటు దీనికి అమర్చిన మరో పరికరంతో పంటచేల్లో విష పురుగులు రైతుల దగ్గరికి రాకుండా శబ్దం చేస్తుంది. కేవలం రూ.200 ఖర్చుతో మాత్రమే ఈ పరికరం తయారు చేయవచ్చని గైడ్ టీచర్ ఉమామహేశ్వర్ తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థితో పాటు ఉపాధ్యాయుడిని పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: విద్యుత్ వినియోగదారులకు డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నిర్మల్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతరాయాలు మరియు డీటీఆర్ వైఫల్యాలను తగ్గించడంలో లైన్, డీటీఆర్ నిర్వహణ ప్రాముఖ్యతను వివరించారు. వినియోగదారులకు సిబ్బంది సేవలను సమర్థవంతంగా అందేలా చూడాలన్నారు. వినియోగదారులకు అవగాహన కల్పించడం ద్వారా డిజిటల్ చెల్లింపులను మెరుగుపర్చాలన్నారు. సమావేశంలో సీజీఎం ఫైనాన్స్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ కమర్షియల్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

పాలోది రాములగుట్ట ప్రాశస్త్యం


గుట్టపై ఉన్న కోనేరు నీటిని తీసుకెళ్తున్న భక్తులు


గుట్టపై నిర్మించిన రామాలయం

ప్రస్తుతం అంతా అయోధ్యలోని రామాలయంలో బలరాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా గ్రామాల్లో పూజల సందడి కనిపిస్తోంది. అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవ నేపథ్యంలో అన్ని రామాలయాలతో పాటు ఇతర ఆలయాల్లో విశేషంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పాలోది గ్రామ సమీపంలో గుట్టపై ఉన్న సీతారామచంద్రుల ఆలయంపై కథనం.

- వనవాస సమయంలో గుట్టపై సేదతీరిన రాములోరు
- ఏటా ఐదురోజుల పాటు జాతర

తాంసి: త్రేతా యుగంలో శ్రీరాముడు వనవాస సమయంలో ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పాలోది శివారులో ఉన్న రాములగుట్ట ప్రాంతంలో సీతా, లక్ష్మణుల సమేతంగా వనవాసం చేసినట్లు స్థానిక చరిత్ర చెబుతోంది. గుట్టపై రాముల వారి పాదుకలు ఉండడంతో వనవాస సమయంలో శ్రీ సీతారామచంద్రుల వారు గుట్టపై సేదతీరినట్లు పూర్వీకులు గుర్తించి గుట్టకు రాములగుట్ట అని నామకరణం చేశారు. గుట్టపై ఉన్న గుహలో రాముని పాదుకలను ఉంచి ఏటా స్థానికులు పూజలు నిర్వహించేవారు. శ్రీరాముడు సేదతీరినట్లుగా గుర్తించిన నేపథ్యంలో క్రమంగా ఈ ప్రాంతాన్ని స్థానికులు అభివృద్ధి చేశారు. గుట్టపై ఆలయాన్ని నిర్మించి అందులో నూతన విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. ఏటా మాఘశుక్ల ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు ఐదురోజుల పాటు పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తారు. చివరి రోజున శ్రీ సీతారామచంద్రుల కల్యాణం సైతం ఘనంగా నిర్వహిస్తున్నారు. రాముడి వనవాస సమయంలో సేద తీరడంతో ఇక్కడి ప్రాంతంలోని ప్రజలకు రాముని ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని ఏటా పంటలను సాగు చేసే సమయంలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు గుట్టపై ఉన్న రామున్ని దర్శించుకుని సాగుకు సన్నద్ధమవుతారు.

ఏడాది పొడవునా జలధార

రాములగుట్టపై వెలిసిన శ్రీ సీతారామచంద్రుల ఆలయం వద్ద ఉన్న కోనేరుకు చాలా ప్రాశస్త్యం ఉంది. గుట్టపై ఉన్న కోనేరులో సంవత్సరం పొడవునా జలధార ఉంటుంది. రాముని పాదాల కింద నుంచి వస్తున్న జలధారతోనే కోనేరులో సంవత్సరం పొడవునా నీరు ఉంటుందని భక్తుల నమ్మకం. ఈ కోనేరు నీటిని తాగితే రోగాలు పోతాయని, పంటచేలలో చల్లితే పంటలు బాగా పండుతాయని ఇక్కడి ప్రజల నమ్మకం. ఏటా శ్రావణ మాసంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రాములగుట్టకు వచ్చి ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పచ్చని చెట్ల మధ్య గుట్టపై ఉన్న ఆలయ సమీపంలో నైవేద్యాలను వండి రాములోరికి సమర్పిస్తారు. అనంతరం కోనేరులోని నీటిని తీసుకెళ్లి పంటచేలలో చల్లుతారు. దశాబ్దల కాలంగా రాములగుట్టకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడి భక్తుల కొంగు బంగారంగా మారి భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తూ జిల్లాలో ప్రత్యేక క్షేత్రంగా రాములగుట్ట నిలుస్తోంది.

నేడు ఇంజినీరింగ్ అధికారుల క్రికెట్ మ్యాచ్

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ (ఏటీఏఈఈ) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పీఆర్, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ వంటి వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక టీంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ టీం ఈనెల 7న సిద్దిపేటలో మెదక్ జిల్లా టీంతో జరిగిన తొలిమ్యాచ్‌లో విజయం సాధించిందన్నారు. రెండో మ్యాచ్ ఈ నెల 21న పట్టణ శివారులోని చాంద(టి) మైదానంలో వరంగల్ జిల్లా టీంతో తలపడనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు డి.నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ అధికారుల మధ్య స్నేహభావం పెంపొందించేందుకు రాష్ట్రస్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లుగా వెల్లడించారు.

విద్య, వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనకు చాందా(టి) జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్యాంరావ్ తెలిపారు. శనివారం ఎంపీటీసీ బొడగరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరపు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు 6 ఉప అంశాలలో 153 ప్రాజెక్టులు పాల్గొనగా తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పడాల కార్తీక్, అంబటి విఘ్నేష్ అందులో ఉన్నారన్నారు. వారు కమర్షియల్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. గైడ్ టీచర్ ఆరె భాస్కర్, ఉపాధ్యాయులు అమరేందర్, విద్యాసాగర్, మధుకర్‌వర్మ, దేవిదాస్, రాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మందిర రూపం.. భక్తి నీరాజనం...

- కాగితం, కార్డ్‌బోర్డుతో అయోధ్య రామాలయం తయారీ
- నిర్మల్ జిల్లా స్వర్ణకారుడి రూపకల్పన


మందిర ఆకృతులతో టెక్మల్ నర్సింహస్వామి

నిర్మల్ ఖిల్లా: కేవలం కార్డ్‌బోర్డు అట్టలు, కాగితపు ముక్కలతో అపురూపమైన అయోధ్య రామమందిరాన్ని రూపొందించాడు నిర్మల్ జిల్లాకు చెందిన స్వర్ణకారుడు చూడచక్కనైన గోపురాలతో ప్రవేశ ద్వారం, స్తంభాలు, మందిర నిర్మాణం అచ్చు అయోధ్య రామమందిరాన్ని పోలిఉండేలా తీర్చిదిద్దారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన స్వర్ణకారుడు టెక్మల్ నరసింహస్వామి స్వర్ణకార వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయోధ్యలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన భవ్య రామమందిరం ఈనెల 22న ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రామాలయాన్ని పోలిన నమూనా తయారు చేయాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా అట్ట ముక్కలు, కాగితాలతో చూడచక్కని రూపంలో ఉన్న అయోధ్య రామ మందిరాన్ని అద్భుతంగా మలిచాడు. స్తంభాలు, గోపురాలను కూడా ఆకట్టుకునే రీతిలో తీర్చిదిద్దాడు.

కేస్లాపూర్ చేరిన ప్రచార రథం


కటోడాలకు మర్యాద చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఫిబ్రవరి 9న నిర్వహించనున్న నాగోబా మహాపూజ, జాతర నిర్వహణపై చేపట్టిన ప్రచార రథం శనివారం కేస్లాపూర్‌కు చేరుకుంది. రథంలో ప్రచారానికి వచ్చిన కటోడ మెస్రం కోసేరావ్, ప్రధాన్ కిత పెద్ద మెస్రం దాదారావ్‌లకు అతిథి మర్యాదలు చేసి కేస్లాపూర్ పంపించారు. ప్రచారం రథం కేస్లాపూర్ చేరడంతో ఆదివారం ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులు హాజరై పవిత్ర గంగాజలం సేకరణ యాత్ర ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. గోదావరి హస్తిన మడుగు నుంచి సేకరించిన పవిత్ర గంగాజలంతో ఫిబ్రవరి 9న నాగోబాకు జలాభిషేకం చేసి ప్రత్యేక పూజల అనంతరం నాగోబా జాతర ప్రారంభించనున్నట్లు వారు పేర్కొన్నారు.

క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నిర్మల్‌టౌన్: మంగ్లారపు సుశీల– రాములు జ్ఞాపకార్థం వారి కుమారుడు మంగ్లారపు పోశెట్టి శ్రీ బాలాజీ జువెల్లర్స్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్‌లో ఓంకారేశ్వర క్రికెట్ టోర్నమెంట్‌ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నరహరి, మాజీ కౌన్సిలర్ రాజేశ్వర్, ప్రసాద్ బాబు, పోశెట్టి, శివకుమార్ ,ప్రకాష్ ,రాములు, చంద్రకాంత్ ,రాజన్న ,సాయికుమార్, సందీప్, శశాంక్, సుశాంత్ పాల్గొన్నారు.

రేపు పత్తి కొనుగోళ్లు బంద్

భైంసాటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో భూసార్‌బీట్‌తో పాటు సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు సోమవారం నిలిపేయనున్నట్లు ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి అడెల్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట నేపథ్యంలో కొనుగోళ్లు నిలిపేయాలన్న అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

కుభీర్: ఈ నెల 22న సోమవారం కుబీర్ మార్కెట్ సీసీఐ కొనుగోళ్లు నిలివేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని తిరిగి మంగళవారం యథావిధిగా పత్తి కొనుగోళ్లు చేపట్టనున్నట్లు తెలిపారు.

29న ఎస్ఎంసీ ఎన్నికలు

భైంసాటౌన్: పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 29న ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్ఎం స్వర్ణమంజుల ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఎన్నికలకు 3 నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

విద్యార్థులతో పొదుపు..

సోన్: విద్యార్థులకు చదువుతో పాటు నగదు పొదుపు పాఠాలను చెబుతున్నారు మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నాగయ్య కుర్మే. చదువుకు క్రమ శిక్షణ ఎంత అవసరమో, జీవితానికి పొదుపు అంతే అవసరమనే సందేశంతో 9వ తరగతి విద్యార్థులు పొదుపు నిధి ఏర్పాటుకు తన వంతు కృషి చేశారు. రెండు నెలల నుండి పాఠశాల విద్యార్థులచే చిరుతిండ్లు మాన్పించి సమకూరిన రూ.2వేలతో అలహాబాద్ బ్యాంక్‌లో ఉమ్మడి ఖాతా తీసి అందులో నగదు జమ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన, సర్పంచ్ వినోద్ కుమార్, మురళీధర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు.

చర్యలు తీసుకోవాలి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని దేవుని చెరువుకు వెళ్లే దారిలో గ్రామ కంఠం పరిధిలోని చింత చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నర్సాపూర్(జి) గ్రామస్తులు శనివారం పంచాయతీ కార్యదర్శి వీణా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. దీనిపై తగు విచారణ చేసి గ్రామ సంపదను కాపాడేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఎద్దుకు అరుదైన ఆపరేషన్..!

కుంటాల: కుంటాల మండల కేంద్రానికి చెందిన జక్కుల శివరాజ్ అనే రైతుకు చెందిన ఎద్దు కుడి కొమ్ము విరిగిపోయింది. దీంతో గత కొద్ది రోజులలుగా బాధపడుతుండగా ఆపరేషన్ అవసరమని వైద్యులు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మామడ, పొన్కల్ పశువైద్యాధికారులు ఓంప్రకాష్, శ్రీకర్ రాజ్ కుంటాలకు చేరుకుని ఎద్దు కొమ్ముకు గంటపాటు అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో సిబ్బంది శ్రీధర్,సంతోష్ ఉన్నారు.

సమ్మక్క- సారలమ్మ విగ్రహాల ఊరేగింపు



కుంటాల: ముధోల్ మండలం ఎడ్‌బిడ్ తండాలో ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కుంటాల మండలంలోని గ్రామాల్లో శనివారం సమ్మక్క– సారలమ్మ విగ్రహా లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళలు అమ్మవార్లకు ఒడి బియ్యం, బంగారం(బెల్లం) సమర్పించి పూజలు చేశారు. ఆలయ పూజారి రేణుకమ్మ పాల్గొన్నారు.

మద్యం, మాంసం నిషేధించాలి

నర్సాపూర్(జి): ఈ నెల 22 మండల కేంద్రంలో మద్యం, మాంసం విక్రయాలు జరుగకుండా నిషేధించాలని కోరుతూ శనివారం గ్రామస్తులు ఏఎస్ఐ మాన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. నరేందర్, నవీన్ ఉన్నారు.



పైచిత్రంలో కనిపిస్తున్నది భైంసాలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం. దాదాపు 68 మంది విద్యార్థులు వసతి పొందుతుండగా, సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. అలాగే ఇరుకు గదులు ఉండడంతో పాటు గాలి, వెలుతురు వసతి సరిగా లేదు. ఈ భవనానికి నెలకు అద్దె రూ.36వేలు చెల్లిస్తున్నారు.

పట్టణంలోని కమల థియేటర్ సమీపంలోని ఓ అద్దె భవనంలో బీసీ బాలుర వసతిగృహం కొనసాగుతోంది. ఇందులో 55 మంది విద్యార్థులు వసతి పొందుతుండగా, భవన అద్దె రూపంలో నెలకు రూ.14,841 చెల్లిస్తున్నారు. విద్యార్థులకు సరిపడా గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. డైనింగ్‌హాల్ లేక ఉన్న గదుల్లోనే భోజనం చేస్తున్నారు.





పట్టణంలోని భైంసా–బాసర రోడ్డులో నిర్మల్ చౌరస్తా సమీపంలోని అద్దె భవనంలో ఎస్సీ బాలికల వసతిగృహం నిర్వహిస్తున్నారు. ఈ వసతిగృహంలో 80 మంది విద్యార్థినులు వసతి పొందుతుండగా, భవనానికి నెలకు రూ.56,750 అద్దె చెల్లిస్తున్నారు. ఇక్కడా విద్యార్థుల సంఖ్యకు సరిపడా వసతులు లేక ఇబ్బంది ఎదురవుతోంది.

అద్దె భవనాల్లో వసతి..!

- నెలకు రూ.వేలల్లోనే చెల్లింపులు
- అయినా వసతులు అంతంతే..

భైంసాటౌన్: పట్టణంలోని పలు పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. బీసీ(బాలుర/బాలికల), ఎస్సీ(బాలుర/బాలికల) వసతిగృహాలు ఉండగా, వీటి పరిధిలో దాదాపు 300 వరకు విద్యార్థినీ విద్యార్థులు వసతి పొందుతున్నారు. వసతిగృహాలు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ సొంత భవనాలు లేవు. దీంతో అద్దె భవనాలకు నెలకు రూ.వేలల్లోనే అద్దెలు చెల్లిస్తున్నారు. భైంసా పట్టణంలో చదరపు అడుగుకు రూ.8.50చొప్పున, నిర్మల్‌లో రూ.10 చొప్పున అద్దె నిర్ణయించి చెల్లిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. సదరు అద్దె భవనాల్లో విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇరుకు గదులు, గాలి, వెలుతురు సరిగా లేకపోవడంతో పాటు సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అరకొర వసతులతో నెట్టుకొస్తున్నారు. చలికాలంలో చన్నీటి స్నానాలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అద్దె బిల్లులు సైతం సకాలంలో రాకపోవడంతో సౌకర్యాల కల్పనపై భవన యజమానులను ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంది. వసతిగృహాలకు శాశ్వత భవనాలు నిర్మించడం ద్వారా ప్రభుత్వానికి అద్దెల రూపంలో నిధులు మిగులుబాటుతోపా టు విద్యార్థులకు సరిపడా వసతులు అందుబాటులో ఉంటాయి.

నర్సింహానగర్‌లోని బీసీ బాలికల వసతిగృహం సైతం అద్దె భవనంలో కొనసాగుతుండగా, నెలకు రూ.34,495 అద్దె చెల్లిస్తున్నారు. ఇందులో 75 మంది విద్యార్థినులు వసతి పొందుతుండగా, సరిపడా వసతులు లేవు. మంచాలు, బెడ్లు లేకపోవడంతో ఫ్లోర్‌పైనే నిద్రిస్తున్నారు.

రిసోర్స్ పర్సన్‌కి గౌరవ వేతనం అందించాలి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు వినతి

నిర్మల్‌చైన్‌గేట్: రిసోర్స్ పర్సన్‌కి గౌరవ వేతనం రూ.18వేలు అందించాలని కోరుతూ నియోజకవర్గ ఐకేపీ రిసోర్స్ పర్సన్‌లు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకి వినతి అందజేశారు. మెప్మా పరిధిలో పనిచేసే సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం శ్రీహరి రావు క్యాంపు కార్యాలయంలో రిసోర్స్ పర్సన్‌లు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2018 జనవరి నుంచి నెలకు రూ.4వేలు గౌరవ వేతనం చెల్లించారని, ఈ వేతనం పనికి సమర్థవంతంగా లేదన్నారు. ప్రభుత్వం చేపట్టే పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న తమకు న్యాయం చేయాలన్నారు. జీవో 164లో కొన్ని నిబంధనల కారణంగా ఆర్‌పీలు చాలా నష్టపోతున్నామన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఐకేపీ రిసోర్స్ పర్సన్స్

ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన

ఖానాపూర్: 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ పరిమళ్ భౌమిక్ అన్నారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకూ నిర్వహించిన 2కే రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ రాజేశ్వర్ ఉన్నారు.

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ గ్రామంలోని స్థానిక పోలింగ్ బూత్ ఆవరణలో ఓటరు నమోదు ప్రక్రియను తహసీల్దార్ డి.సరిత పరిశీలించారు. ఇందులో ఎమ్మార్ఐ సంతోష్ పాల్గొన్నారు.

కుంటాల: ఓటరుగా నమోదు చేయించాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. మండలంలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. డీటీ నరేష్, ఆర్ఐ అడెల్లు ఉన్నారు.

కుభీర్: మండలంలోని ఆయా గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ సోము పరిశీలించారు.



ఖానాపూర్: 2కే రన్‌లో పాల్గొన్న తహసీల్దార్

ఓటరు నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలి

తానూరు: 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ లింగం మూర్తి సూచించారు. మొత్తం 64 ఓటరు నమోదు కోసం దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మోహన్‌సింగ్, ఆయా గ్రామాల బీఎల్ఓ ఉన్నారు.

ఆలయ ప్రారంభాన్ని పండుగలా నిర్వహించాలి

ఖానాపూర్: ఈ నెల 22న అయోధ్య ఆలయ ప్రారంభోత్సవ వేడుకలను ఊరూరా, ఇంటింటా పండుగలా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, భైంసా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జాదవ్ రాజేష్‌బాబు అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందూ బంధువుల చిరకాల కోరిక అయోధ్య ఆలయ నిర్మాణం ప్రధాని మోదీతోనే సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో నాయకులు మదిరె సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, కొండా సురేష్, రంజిత్, మధుకర్, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

22న విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 22న అయోధ్య శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు అరవింద్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ పిలుపుమేరకు యావత్ భారతదేశంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు సాదం అరవింద్, పట్టణ ప్రధాన కార్యదర్శులు అల్లం భాస్కర్, శ్రీరామోజీ నరేష్, పట్టణ ఉపాధ్యక్షుడు వడ్నాల రాజు, మూడారపు దిలీప్, యువమోర్చా అధ్యక్షుడు పొలాస భరత్, కార్యదర్శి సజన్, రిషి పాల్గొన్నారు.



డీఈవో ఆఫీస్‌లో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దేవరకోట ఆలయంలో పూజలు



ప్రవచనాలు చెబుతున్న రామాంజనేయ స్వామి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రాచీన దేవాలయం దేవరకోట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం త్రిదండి రామాంజనేయ స్వామి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి రామాంజనేయ స్వామి ప్రవచనం చేశారు. జనులందరూ అనునిత్యం దేవాదాయ సందర్శనం చేస్తూ.. స్వామి కృపకు పాత్రులై జీవించాలని సూచించారు. ఇందులో ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ప్రొడ్యూసర్ దిల్ రాజు అన్నయ్య నరసింహారెడ్డి, చించోలి బి సర్పంచ్ రమేష్, గంగాధర్, దేవేందర్ గౌడ్, జాప అనిల్, రాజేశ్వర్ ఉన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



గర్భగుడిని శుద్ధిచేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

దిలావర్‌పూర్: మండలంలోని అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం ఉన్న శ్రీమాతాన్న పూర్ణ కదిలి పాపహేశ్వరాలయంలో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ ప్రధాని పిలుపు మేరకు ఆలయాల పరిశుభ్రత నేపథ్యంలో ఆలయానికి చేరకున్న ఆయన ఆలయ ప్రాంగణాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆయనను పూర్ణకుంభంతో స్వాగతించారు. వచ్చే నెలలో జరిగే మహాశివరాత్రి వేడుకల ఏర్పాట్లుపై స్థానిక పాలక మండలి సభ్యులతో మాట్లాడారు. ఇందులో దిలావర్‌పూర్ జెడ్పీటీసీ సభ్యుడు తక్కల రమణారెడ్డి, ఎంపీటీసీ గంగవ్వ ముత్యంరెడ్డి, సర్పంచ్ జంగం వీరేశ్‌కుమార్, నాయకులు సత్యం చంద్రకాంత్, పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శైలేశ్వర్, ప్రచార కర్త మెట్టు రాజు, దిగంబర్ పాల్గొన్నారు.

22న గోవులతో శోభాయాత్ర

నిర్మల్‌చైన్‌గేట్: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా నిర్మల్ పట్టణంలో అయ్యప్పసేవాసమితి ఆధ్వర్యంలో 108 గోవులతో సోమవారం మధ్యాహ్నం 1 గంటకు శోభాయాత్ర నిర్వహిస్తామని అయ్యప్ప సేవాసమితి జిల్లా అధ్యక్షుడు బద్రి శ్రీనివాస్ తెలిపారు. గాంధీచౌక్ నుంచి పట్టణ పురవీధుల గుండా శోభాయాత్ర సాగుతుందని పేర్కొన్నారు.

దశలవారీగా అభివృద్ధి చేస్తాం

- ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసా: నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. శనివారం బాసర మండల కేంద్రంలోని కౌట గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. నూతనంగా నిర్మించిన ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులు, పల్లె దవాఖానను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా కృషిచేస్తామన్నారు. అదనపు గదుల నిర్మాణానికి స్థలాన్ని దానంగా ఇచ్చిన సోలంకి గంగాధర్‌ను అభినందించారు. ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ధన్‌రాజ్ ఉన్నారు.



పల్లె దవాఖానను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేకు సన్మానం

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు ఉన్నతంగా ఎదగాలి

భైంసారూరల్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఉన్నతంగా ఎదగాలని ఎంపీపీ అబ్దుల్ రజాక్ అన్నారు. శనివారం భైంసా పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మహిళ సంఘాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. ఎమ్మెల్యే రామారావుపటేల్ సహకారంతో మండలాన్ని దశలవారిగా అభివృద్ధిపరుస్తామన్నారు. నూతనంగా ఎంపీపీగా ఎన్నికైన అబ్దుల్ రజాక్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఏపీఎం లక్ష్మణ్, సీసీలు భీంరావు, లక్ష్మణ్, లావణ్య, సిందే లక్ష్మణ్ ఉన్నారు.

ఘనంగా సన్మానం...



ఎంపీపీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మండలంలోని మిర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నూతనంగా ఎంపీపీగా ఎన్నికైన అబ్దుల్ రజాక్ ఘనంగా సన్మానించారు. హెచ్ఎం విద్యాధర్, ఉపాధ్యాయులు దశరథ్, శ్రీనివాస్, మల్లికార్జున్, సత్యనారాయణ, గజేందర్ ఉన్నారు.

పాఠశాలల్లో పోషకుల సమావేశాలు

కడెం: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో మధుసూదన్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీపూర్, నవబ్‌పేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. సీఆర్పీ రాజేశ్వర్ ఉన్నారు.

మామడ: మండలంలోని అన్ని పాఠశాలల్లో పోషకుల సమావేశాలను నిర్వహించారు.

సోన్: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఈ నెల 29న ఉండడంతో జెడ్పీఎస్ఎస్ వెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు నాలం విద్యాసాగర్, ఎస్ఎంసీ చైర్మన్ అంకం జ్ఞానేశ్వర్ ఓటర్ల జాబితాను ఆవిష్కరించారు.

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోషకుల సమావేశంలో మండల నోడల్ అధికారి అశోక్ వర్మ పాల్గొని పోషకలతో మాట్లాడారు. రూం టు రీడ్ మండల కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయుడు పాల్గొన్నారు.



కుంటాల: మాట్లాడుతున్న విద్యార్థిని

భైంసారూరల్: పోషకులు విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ అన్నారు. మండలంలోని దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల పోషకులతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు.

రామాయణ ప్రవచనం..

నిర్మల్: రామాయణం తరతరాలకూ తరగని విషయాలను అందిస్తుందని, ప్రతిఒక్కరూ అందులోని విషయాలను తెలుసుకుని తమ ముందుతరాలకు అందించాలని ప్రవచనకర్త సముద్రాల శ్రీకాంతాచార్యులు అన్నారు. జిల్లాకేంద్రంలోని బస్‌డిపో బోయవాడ హనుమాన్ మందిరం వద్ద శ్రీమద్రామాయణ ప్రవచన కార్యక్రమం శనివారం సాయంత్రమూ కొనసాగింది.

రామాయణ పాత్రల్లో కవలలు..

అయోధ్య ఆలయ ప్రాణప్రతిష్ఠ అందరినీ కదిలిస్తోంది. పలువురు తల్లిదండ్రులూ తమ పిల్లలను సీతారాములుగా వేషధారణలు వేసి రామాయణాన్ని చెబుతున్నారు. జిల్లాకేంద్రంలోని బాగులవాడకు చెందిన అల్లం లలిత–నవీన్ దంపతులు తమ కవల పిల్లలైన సాయిశ్రేయాస్, సాయిసాత్విక, సాయిశాన్వికలో సీత,రాముడు, హన్మంతుడి వేషాలు వేయించి రామాయణాన్ని వారితోనే చేయిస్తూ వివరించారు.



రాముడి చిత్రపటానికి హారతినిస్తున్న చిన్నారులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఖానాపూర్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన అంజుకుమార్‌రెడ్డిని ఖానాపూర్‌కు చెందిన నాయకులు జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ మహేందర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు రవీందర్‌రెడ్డి, సత్తయ్య, రవీందర్‌గౌడ్, రమేష్, కృష్ణ, జీవన్ ఉన్నారు.



అంజుకుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

సదరం తండ్లాట..





మీ సేవ కేంద్రాల వద్ద లబ్ధిదారులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఈ నెల 23న నిర్వహించనున్న సదరం శిబిరాన్ని పురస్కరించుకుని దివ్యాంగులు శనివారం మీసేవల ముందు పడిగాపులు కాశారు. పట్టణంలో రెండు మీసేవలు మాత్రమే ఉండడంతో దివ్యాంగులు పెద్ద ఎత్తున కేంద్రాల ముందు బారులు తీరి స్లాట్ బుకింగ్ కోసం నానా ఇక్కట్లు పడ్డారు. సంబంధిత అధికారులు స్లాట్ బుకింగ్ కోసం ప్రజలకు సరిపడా కేంద్రాలు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేయాలని వారు కోరుతున్నారు.

నర్సాపూర్(జి): సదరం స్పెషల్ క్యాంప్ నెలలో మూడు సార్లు నిర్వహించేలా చూడాలని, స్లాట్ బుకింగ్ సంఖ్యను పెంచాలని నర్సాపూర్ (జి) మండల అర్హత గల దివ్యాంగులు కోరుతున్నారు. దివ్యాంగులకు సదరం స్పెషల్ క్యాంప్ కోసం స్థానిక పరిధిలోని పీహెచ్‌సీ వైద్యుడి ఔట్ పేషంట్ స్లిప్‌తో మీ సేవలో స్లాట్ బుకింగ్ సౌకరాన్ని శనివారం ఒక్క రోజు అవకాశం కల్పించారు. దీంతో అర్హత గల దివ్యాంగులకు అవస్థలు తప్పడం లేదు.

పిల్లలకు పరీక్ష.. పెద్దలకు నిరీక్షణ

నిర్మల్ జిల్లా కేంద్రంలో విద్యాశాఖ నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అయితే పిల్లలు పరీక్షల కోసం కేంద్రాలకు వెళ్లగా తల్లిదండ్రులు ఆరుబయట దాదాపు రెండున్నర గంటల పాటు పడిగాపులు కాశారు. విద్యార్థులు పరీక్ష హాల్లో సాఫీగా పరీక్ష రాసి బయటకు వస్తూ తోటి మిత్రులతో పరీక్ష రాసిన తీరును చర్చిస్తూ కనిపించారు.

– సాక్షి ఫోటోగ్రాఫర్, నిర్మల్



